సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 17 । నవంబర్ । 2024



.. గుడిసెల తొలగింపు

రిజర్వ్ ఫారెస్టు భూమిలో గిరిజనుల గుడిసెలను అధికారులు తొలగించడంతో ఇరువర్గాల నడుమ వాగ్వాదం జరిగింది. 8లో



పతకాల పంట!

గుండాలకు చెందిన కొండపల్లి చందన చిన్నప్పటి నుంచే కరాటేపై ఆసక్తితో శిక్షణ పొంది పలు పతకాలు సొంతం చేసుకుంటోంది. 15లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 30° / 19°

జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రత అధికంగానే ఉంటుంది. రాత్రిపూట వాతావరణం కొంత మేర చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నిత్యాన్నదానానికి విరాళం

ఆలయ ఆధ్వర్యంలో నిర్వహించే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన గుండ్లపల్లి నియంత్, స్రవంతి దంపతులు శనివారం రూ.లక్ష చెక్కును ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించగా, అధికారులు స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక బహూకరించారు. ఆలయ సిబ్బంది సాయిబాబు, అర్చకులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా చూసుకోండి



అన్నపురెడ్డిపల్లి మండలం అబ్బుగూడెంలో సర్వేను పరిశీలిస్తున్న సీఈఓ

చండ్రుగొండ : ఇంటింటి సమగ్ర సర్వేలో తప్పులు లేకుండా చూసుకోవాలని జిల్లా పరిషత్ సీఈఓ కె.చంద్రశేఖర్ ఎన్యుమరేటర్లకు సూచించారు. చండ్రుగొండ మండలంలోని తిప్పనపల్లి, అన్నపురెడ్డిపల్లి మండలంలోని మర్రిగూడెం, అబ్బుగూడెం గ్రామాల్లో శనివారం ఆయన సర్వే తీరుతెన్నులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సర్వే వేగవంతం చేయాలని సూచించారు. మండల అధికారులు సర్వే తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్వర్‌ప్రసాద్, ఎంపీడీఓ మహాలక్ష్మి, ఆర్‌ఐ మధు పాల్గొన్నారు.

రైతులకు అసౌకర్యం కలిగించొద్దు



తేమశాతాన్ని పరిశీలిస్తున్న వేణుగోపాల్

ములకలపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అసౌకర్యం కలిగించొద్దని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సిబ్బందిని ఆదేశించారు. మండల పరిధిలోని మాధారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. యార్డులో అరబెట్టిన ధాన్యం, తేమ శాతాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ .. ధాన్యం కొనుగోళ్లలో నిబంధనలు పాటించాలన్నారు. ధాన్యాన్ని తూర్పారబట్టాలని, తేమ శాతం 17 ఉండేలా జాగ్రత్త వహించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్‌పర్సన్ నడిపల్లి సునంద, సీఈఓ కుంచారపు శ్రీనివాసరావు, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్ బొమ్మకంటి కామేశ్ పాల్గొన్నారు.

రిజర్వేషన్ దామాషాపై నేడు బహిరంగ విచారణ

ఖమ్మంమయూరిసెంటర్: స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ దామాషాపై బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ భూసాని వెంకటేశ్వరరావు, సెక్రటరీ బి.సైదులు ఆధ్వర్యాన ఆదివారం బహిరంగ విచారణ చేపట్టనున్నారు. కలెక్టరేట్‌లో ఉదయం 11–30నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు జరిగే విచారణలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన కుల సంఘాలు, సంస్థల నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరై అభిప్రాయాలు తెలపాలని బీసీ అభివృద్ధి అధికారి జి.జ్యోతి సూచించారు. కులాల స్థితిగతులపై వ్యక్తులు, అసోసియేషన్ల బాధ్యులు స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన, అవసరమైన రిజర్వేషన్ల దామాషాను పేర్కొంటూ విషయంలో అభ్యర్థనలు, సలహాలను కమిషన్‌కు అందజేయొచ్చని ఆమె తెలిపారు.

కార్తీక మాసం కావడంతో శివనామ స్మరణతో భక్తులు పరవశిస్తున్నారు. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు పోటెత్తుతున్నారు. ముఖ్యంగా ప్రతీ సోమవారం శివాలయాలు కిటకిటాడుతున్నాయి. ఇదే సమయంలో తమిళనాడులోని అరుణాచల క్షేత్రం తరహాలో జిల్లాలోని దుమ్ముగూడెం మండలం నర్సాపురం గ్రామంలో నిర్మించిన చిన్న అరుణాచల దేవాలయానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

మన అరుణాచలం.. మహా పవిత్రం

సండే స్పెషల్



నర్సాపురంలోని చిన్న అరుణాచల ఆలయం



ఆలయ ముఖద్వారం వద్ద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహం

తమిళనాడు క్షేత్రం తరహాలో నిర్మాణం

- అపీతకుచలాంబ సమేత అరుణాచల ప్రదక్షిణకు తరలివస్తున్న భక్త జనం
- కార్తీకమాసంలో కిటకిటలాడుతున్న నర్సాపురం ఆలయం

భద్రాచలం – పర్ణశాల మధ్య..

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. వారిలో చాలా మంది పర్ణశాలకు కూడా వెళ్తుంటారు. భద్రాచలం – పర్ణశాల మధ్యన నర్సాపురం గ్రామంలో ప్రధాన రహదారి పక్కనే చిన్న అరుణాచల క్షేత్రం ఉంది. భద్రాచలం నుంచి 14 కి.మీ., పర్ణశాల నుంచి 21 కి.మీ. దూరంలో ఈ ఆలయం ఉంది. ఆలయ ముఖద్వారం దగ్గర మలేషియాలో ప్రసిద్ధి చెందిన సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం తరహాలో ఇక్కడ ఏర్పాటు చేసిన 21 అడుగుల సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

తమిళనాడు తరహాలోనే..

తమిళనాడులోని తిరువణ్ణామలైలో ఉన్న అరుణగిరిని శివపార్వతుల ప్రతిరూపంగా కొలుస్తూ 14 కిలోమీటర్ల మేర గిరి ప్రదక్షిణ చేసేందుకు భక్తులు తపించిపోతుంటారు. అయితే వ్యయప్రయాసల కోర్చి అంతదూరం వెళ్లడం భక్తులందరికీ సాధ్యమయ్యే పని కాదు. కానీ అరుణాచల క్షేత్రాన్ని సందర్శించుకోవాలనే కోరిక చాలా మందికి ఉంటుంది. కాగా, అచ్చం అరుణాచలం తరహాలోనే నర్సాపురంలో చిన్న అరుణాచలం ఆలయాన్ని నిర్మించారు. 1008 శివలింగాలతో పాటు అపీతకుచలాంబాదేవి (పార్వతి) కొలువైన గర్భగుడిని అరుణగిరిగా భావిస్తూ ఇక్కడ భక్తులు ప్రదక్షిణ చేస్తారు. ఈ గర్భగుడి చుట్టూ అరుణాచలం తరహాలోనే అష్ట దిక్పాలకులతో పాటు సూర్యచంద్రులు పూజించిన శివలింగాలను ప్రతిష్ఠించారు. గర్భగుడినే అరుణగిరిగా భావిస్తూ ప్రదక్షిణ చేసే భక్తులు ఈ లింగాలకు అభిషేకం చేసుకోవచ్చు. కృత్తికా నక్షత్రం రోజున మహాదీపం వెలిగించేందుకు 42 అడుగుల ఎత్తయిన శిలాస్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఆ రోజున మహాదీపం వెలిగించి, ఆ తర్వాత లక్ష దీపార్చన కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది డిసెంబర్ 13న ఈ కార్యక్రమం జరగనుంది.

ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రతిష్ఠ..

దేశంలోని వివిధ ప్రాంతాల్లో కొలువై ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగాలను చిన్న అరుణాచల క్షేత్రంలో భక్తుల కోసం ప్రతిష్ఠించారు. దేశ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన సోమ్‌నాథ్ (గిర్, గుజరాత్), మల్లికార్జున (శ్రీశైలం, ఏపీ), మహాకాళేశ్వర్ (ఉజ్జయిని, మధ్యప్రదేశ్), ఓంకారేశ్వర్ (ఖండ్వా, మధ్యప్రదేశ్), వైద్యనాథ్ (మహారాష్ట్ర), భీమశంకర్ (మహారాష్ట్ర), రామేశ్వరం (తమిళనాడు), నాగేశ్వరం (ద్వారక, గుజరాత్), కాశీ విశ్వనాథ్ (వారణాసి, ఉత్తర్‌ప్రదేశ్), త్రయంబకేశ్వర్ (నాసిక్, మహారాష్ట్ర), కేదార్‌నాథ్ (ఉత్తరాఖండ్), ఘృశ్నేశ్వర్ (ఔరంగాబాద్, మహారాష్ట్ర) జ్యోతిర్లింగాలు ఇక్కడ ఉండడంతో ఈ క్షేత్రానికి వచ్చిన భక్తులు దర్శించుకోవచ్చు. వీటితో పాటు శ్రీపాద లింగం, శ్రీచక్ర లింగం, పంచముఖ లింగం, పాతాళ లింగం తదితర 42 లింగాలను దర్శించుకునే అవకాశం కూడా భక్తులకు కలుగుతుంది. కార్తీక మాసంలో వేర్వేరు పుణ్యక్షేత్రాలకు వెళ్లలేని భక్తులు ఒకే చోట వివిధ రూపాల్లో ఉన్న శివయ్యను కనులార దర్శించి తరించవచ్చు.



ఆలయంలో ప్రతిష్ఠించిన శ్రీపాద లింగం

ఉజ్జయిని పద్ధతిలో భస్మాభిషేకం..

ఉజ్జయిని మహాకాళేశ్వర్ ఆలయంలో ప్రతీ రోజు ఉదయం ప్రాతఃకాల సమయంలో భస్మాభిషేకం నిర్వహిస్తారు. అదే పద్ధతిలో చిన్న అరుణాచల ఆలయంలో స్వామివారికి ప్రతీ సోమవారం రథ, నాగ, సింహ తదితర 21 రకాల హారతులు సమర్పిస్తారు.

వడ్డీ బకాయిలు విడుదల



- ఉమ్మడి జిల్లాలో 6,757 ఎస్‌హెచ్‌జీలకు లబ్ధి
- రూ.2.56 కోట్ల నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- గత డిసెంబర్‌కు ముందు బకాయిలపై స్పష్టత ఇవ్వని వైనం

ఖమ్మంమయూరిసెంటర్: స్వయం సహాయక సంఘాల సభ్యులకు మంజూరు చేస్తున్న బ్యాంక్ లింకేజీ రుణాలకు సంబంధించి వడ్డీ బకాయిలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ విషయమై ప్రభుత్వం నుంచి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కార్యాలయానికి లేఖ అందింది. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించి బకాయిలు మంజూరు చేస్తున్నట్లు ఈ లేఖలో వెల్లడించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 6,757 సంఘాలకు గాను రూ.2,56,72,739 విడుదల కాగా, ఈ నిధులను వడ్డీ లేని రుణాలకు అర్హత పొందిన సంఘాల సభ్యుల ఖాతాల్లో జమ చేస్తారు.

ఇప్పటివరకు నాలుగు నెలల బకాయిలు

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఎస్‌హెచ్‌జీలకు వడ్డీ లేని రుణాలకు సంబంధించి బకాయిలను విడుదల చేస్తోంది. గత ఏడాది డిసెంబర్, ఈ ఏడాది జనవరి బకాయిలు ఈ ఏడాది మార్చిలో విడుదలయ్యాయి. తాజాగా ఫిబ్రవరి, మార్చి నెలల వడ్డీ బకాయిలు మంజూరయ్యాయి. గతంలో డిసెంబర్ నెలకు గాను 14,404 ఎస్‌హెచ్‌జీలకు రూ.3,90,76,000, జనవరి నెల బకాయిలు 13,904 ఎస్‌హెచ్‌జీలకు రూ.3,75,06,000ను మంజూరు చేసింది. అవి సభ్యుల ఖాతాల్లోకి చేరాయి.

తగ్గుతున్న సంఘాలు

ఖమ్మం జిల్లాలో 25 వేలకు పైగా స్వయం సహాయక సంఘాలు ఉండగా.. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో వడ్డీ లేని రుణాలకు కేవలం 3,983 ఎస్‌హెచ్‌జీలు మాత్రమే అర్హత సాధించాయి. దీంతో ఆయా సంఘాలకు ప్రభుత్వం రెండు నెలల(ఫిబ్రవరి, మార్చి) బకాయిలు రూ.1,65,57,032 విడుదల చేసింది. ఇక భద్రాద్రి జిల్లాలో 23 వేలకు పైగా సంఘాలు ఉన్నప్పటికీ 2,774 సంఘాలు మాత్రమే అర్హత సాధించాయి. ఈ మేరకు సంఘాలకు రూ.91,15,701 బకాయిలను ప్రభుత్వం మంజూరు చేసింది. గతంలో 90 శాతం మేర సంఘాలు వీఎల్‌ఆర్‌కు అర్హత సాధించేవి. కొంతకాలంగా పలు సంఘాల సభ్యులు రుణాలను సకాలంలో చెల్లించకపోవడంతో ప్రభుత్వం అమలు చేస్తున్న వడ్డీ లేని రుణ పథకానికి దూరమవుతున్నాయి. అధికారులు సైతం అవగాహన కల్పించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంటోందనే విమర్శలు ఉన్నాయి.

పాత బకాయిల మాటేమిటి?

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణ పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించింది. అన్నట్లుగానే అధికారంలోకి రావడంతో గత ఏడాది డిసెంబర్ నుంచి బకాయిలను మహిళా సంఘాల సభ్యులకు చెల్లిస్తోంది. ఇలా ఇప్పటివరకు నాలుగు నెలల బకాయిలు చెల్లించినప్పటికీ అంతకు ముందు బకాయిలపై ప్రకటన చేయకపోవడంతో మహిళా సంఘాల సభ్యులు ఆందోళన చెందుతున్నారు. 2019 – 20 నుంచి వేలాది సంఘాలకు వడ్డీ బకాయిలు పేరుకుపోవడంతో వాటిని విడుదల చేస్తుందా లేదా అనే అయోమయం సంఘాల్లో నెలకొంది. అంతేకాక ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు బకాయిలు కూడా అందాల్సి ఉంది.

గ్రూప్–3 పరీక్షలకు సర్వం సిద్ధం

- 13,478 మంది అభ్యర్థులు.. 39 పరీక్ష కేంద్రాలు
- కొత్తగూడెంలో 26, పాల్వంచలో 13 ఏర్పాటు

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే గ్రూప్- 3 పరీక్షలకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆది, సోమవారాల్లో జరిగే ఈ పరీక్షలకు కొత్తగూడెంలో 26, పాల్వంచలో 13 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 13,478 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ సంబంధిత అధికారులతో మూడు రోజుల క్రితమే సమీక్ష సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. పరీక్షల నిర్వహణకు 39 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 39 మంది డిపార్టమెంటల్ అధికారులు, 12 మంది ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, పరీక్షలు రాసే అభ్యర్థులను గుర్తించడానికి 148 మంది అధికారులు, 12 మంది రూట్ ఆఫీసర్లు, 40 మంది అబ్జర్వర్లను నియమించారు. వీరితో పాటు రాష్ట్రస్థాయి పరిశీలకులు కూడా విధులు నిర్వహించనున్నారు. ప్రతి కేంద్రం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. బయోమెట్రిక్ హాజరు తీసుకోవాలని నిర్ణయించారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి అర్ధగంట ముందే కేంద్రాల వద్దకు చేరుకోవాలని ఇప్పటికే విస్తృత ప్రచారం నిర్వహించారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, వైద్యసౌకర్యం వంటి ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులకు అనుకూలంగా ఉండేలా అన్ని ప్రాంతాల నుంచి రవాణా సౌకర్యం కోసం ఆర్టీసీ చర్యలు చేపట్టింది. కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి వేయాలని ఇప్పటికే అధికారులు ఆదేశించారు. మొదటి రోజు ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు, తిరిగి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు.

పటిష్ట పోలీస్ బందోబస్తు

కొత్తగూడెంటౌన్: గ్రూప్–3 పరీక్షలకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ రోహిత్‌రాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 39 కేంద్రాలు ఏర్పాటుచేయగా 300 మంది సిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. అభ్యర్థులు సకాలంలో కేంద్రాల వద్దకు చేరుకోవాలని కోరారు. ఎవరైనా మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



యాసంగి @2,14,320 ఎకరాలు

- అంచనా వేసిన వ్యవసాయ అధికారులు
- జిల్లాలో పెరగనున్న వరి, ఆయిల్‌పామ్ పంటలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో యాసంగి పంటల విస్తీర్ణాన్ని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. గత సీజన్‌లో 2,03,244 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయగా, ఈ ఏడాది 2,14,320 ఎకరాల్లో పంటలు సాగవుతాయని భావిస్తున్నారు. ఈ సారి వరి, ఆయిల్‌పామ్ పంటల సాగు పెరిగే అవకాశం ఉంది. గత యాసంగిలో 60,927 ఎకరాల్లో వరి పంట సాగు చేయగా ఈ సంవత్సరం 68వేల ఎకరాలుగా అంచనా వేశారు. అదేవిధంగా ఇటీవల జిల్లాలో ఆయిల్ పామ్ సాగుపై అధికారులు దృష్టి సారించారు. పలు ప్రాంతాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తూ పామాయిల్ సాగును ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో ఈ పంట విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. గత సీజన్‌లో 63,476 ఎకరాల్లో పామాయిల్ సాగు కాగా, ఈసారి 67 వేల ఎకరాలకు పెరుగుతుందని అంచనా వేశారు.

విత్తనాల అవసరం ఇలా..

జిల్లాలో 68వేల ఎకరాల్లో వరి సాగు చేస్తారనే అంచనా మేరకు 20,400 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని అధికారులు చెబుతున్నారు. అలాగే జొన్న 1,240 ఎకరాలకు 124 క్వింటాళ్లు, మొక్కజొన్న 20వేల ఎకరాలకు 1,600 క్వింటాళ్లు, వేరుశనగ 2,700 ఎకరాలకు 1,890 క్వింటాళ్లు, మినుము 200 ఎకరాలకు 16 క్వింటాళ్లు, బొబ్బెర్లు 450 ఎకరాలకు 36 క్వింటాళ్లు, పెసర 550 ఎకరాలకు 44 క్వింటాళ్ల విత్తనాలు అవసరం అవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది.

వ్యవసాయ శాఖ అంచనా మేరకు పంటల విస్తీర్ణం (ఎకరాల్లో)..

పంట	2023–24	2024–25
వరి	60,927	68,000
జొన్న	1,229	1,240
మొక్కజొన్న	19,731	20,000
పొగాకు	379	450
వేరుశనగ	2,619	2,700
నువ్వులు	146	150
పొద్దుతిరుగుడు	71	80
ఆయిల్‌పామ్	63,476	67,000
మినుము	194	200
బొబ్బెర్లు	429	450
పెసర	506	550
మిర్చి	5,983	6,000
కూరగాయలు	473	500
ఇతర పంటలు	47,081	47,000
మొత్తం	2,03,244	2,14,320



అన్ని రకాల మందులు అందుబాటులో ఉండాలి

- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ డీడీ మంజునాథ్



స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న మంజునాథ్

జూలూరుపాడు: పీహెచ్‌సీలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉండాలని, వైద్యం కోసం వచ్చే బాధితులకు సకాలంలో సేవలందించాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ మంజునాథ్ నాయక్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఫార్మసీ గదిలో మందులు చూసి స్టాక్ రిజిస్టర్లు తనిఖీ చేశారు. కాలం చెల్లిన మందు బాటిళ్లను చూసి ఎందుకు దుర్వినియోగం చేస్తున్నారంటూ ఫార్మసిస్ట్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్స్‌పైరీ కాకముందే రోగులకు మందులు ఇవ్వాలని సూచించారు. అనంతరం మాట్లాడుతూ.. వైద్యారోగ్య శాఖ చేపట్టే కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదని, సమయపాలన పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్‌యూహెచ్‌ఎం పీఓ, ఎన్‌సీడీ డాక్టర్ రామారావు, ఎన్‌హెచ్‌ఎం డీపీఓ దుర్గ, మండల వైద్యాధికారి బి.వెంకటేశ్వర్లు, డాక్టర్లు తేజస్విని, రామక్రిష్ణ, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, హెడ్‌నర్సు వరలక్ష్మీబాయి, ఎంఎల్‌హెచ్‌పీ విద్య, ఫార్మసిస్ట్ తులసీరామ్, ఎల్‌టీ జగదీష్, స్టాఫ్ నర్సు సుమతి పాల్గొన్నారు.

గిరిజన యువతకు ఉచిత శిక్షణ

చుంచుపల్లి: జిల్లాలోని నిరుద్యోగ గిరిజన యువతకు స్పెషల్ సెంట్రల్ అసిస్టెన్స్ స్కీమ్ ద్వారా పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎం.విద్యాచందన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్వాలిటీ అసూరెన్స్, డిప్లొమా ఇన్ ఫైర్‌సేఫ్టీ తదితర కోర్సుల్లో శిక్షణ ఉంటుందని, ఐటీఐ, డిప్లొమా, పదో తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బయోడేటాతో సంబంధిత అర్హత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు జతచేసి పాల్వంచలోని టెక్ షోర్ సర్వీసెస్ కార్యాలయంలో సమర్పించాలని, వివరాలకు 94911 09068, 82828 25428 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

నాటు పుట్టిలో లాహిరి.. లాహిరి..

- కిన్నెరసాని కాలువలో తెడ్డుతో నడిపే పడవ
- ట్రయల్ రన్‌ను పరిశీలించిన కలెక్టర్
- మత్స్య సహకార మహిళా సంఘాల ద్వారా నిర్వహించాలని సూచన
- చార్జీ ఒక్కొక్కరికి రూ.50గా నిర్ణయం

పాల్వంచరూరల్: కిన్నెరసాని వెళ్లే పర్యాటకులు జలాశయంలో బోటింగ్ చేయడానికి ఉత్సాహం చూపిస్తుంటారు. అయితే కిన్నెరసాని జలాశయం నుంచి కేటీపీఎస్ కర్మాగారానికి ప్రవహించే కాలువలోనూ ఇకపై లాహిరి..లాహిరి అంటూ తెడ్డు ద్వారా నడిపే నాటు పుట్టిలో సరదాగా విహరించే అవకాశం త్వరలోనే రానుంది. కాలువను శనివారం పరిశీలించిన కలెక్టర్ జితేష్ వి పాటిల్.. మణుగూరు మండలం కొండాయిగూడెం నుంచి నాటు పుట్టిని తెప్పించి ట్రయల్ రన్ చేసి స్వయంగా పరిశీలించారు. నాటు పుట్టి నిర్వహణ బాధ్యతను కిన్నెరసాని, పునుకుల గ్రామ మత్స్య సహకార సొసైటీ సభ్యుల భార్యలతో ఏర్పాటు చేసిన మహిళా శక్తి సభ్యులకు అప్పగించాలని సూచించారు. తద్వారా వారు స్వయం సమృద్ధి చెందే అవకాశం ఉంటుందని చెప్పారు. నాటు పుట్టి నడిపే ఇద్దరితో పాటు నలుగురు పర్యాటకులు కూర్చునే వీలుంటుందని, కాలువలో 200 మీటర్ల దూరం తీసుకెళ్లి, తిరిగి ఎక్కిన పాయింట్ వద్ద దింపేందుకు(మొత్తం 400 మీటర్లు) ఒక్కొక్కరికి రూ.50 చొప్పున చార్జీగా నిర్ణయించాలని సూచించారు. పది రోజుల్లో నాటు పుట్టి నడిపేలా చర్యలు చేపట్టాలని మత్స్యశాఖ అధికారిని ఆదేశించారు.

డ్యామ్‌పైకి పర్యాటకులను అనుమతించాలి..

కొంతకాలంగా కిన్నెరసానికి వచ్చే పర్యాటకులు డ్యామ్‌పైకి వెళ్లకుండా కేటీపీఎస్ అధికారులు డ్యామ్ గేటుకు తాళం వేయడంతో నిరాశ చెందుతున్నారు. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా కేటీపీఎస్ సీఈ ప్రభాకర్‌రావుకు ఫోన్ చేసి డ్యామ్ పైకి పర్యాటకులను అనుమతించాలని ఆదేశించారు. దీంతో నేటి నుంచి డ్యామ్ పైకి పర్యాటకులు వెళ్లేలా అనుమతిస్తామని సీఈ కలెక్టర్‌కు చెప్పారు. కాగా, కిన్నెరసాని పరిసరాలు, రిజర్వాయర్‌లో ప్లాస్టిక్ బాటిళ్లు, వస్తువులు, వ్యర్థాలు పడేయడం ద్వారా నీటి ప్రవాహం బయటకు రావడం ఇబ్బందిగా ఉందని కేటీపీఎస్ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో డ్యామ్‌పైన, డీర్ పార్కు వద్ద చెత్త బుట్టలు ఏర్పాటు చేయాలని, పర్యాటకులు వ్యర్థాలను వాటిలోనే వేసేలా అవగాహన కల్పించాలని వైల్డ్‌లైఫ్ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ వెంట కేటీపీఎస్ ఎస్‌ఈ మోక్షవీర్, ఏడీఈ రామకృష్ణ, ఏఈ సురేష్, మత్స్య శాఖాధికారి ఇంతియాజ్ ఖాన్, టూరిజం టీఎం దుర్గాప్రసాద్, ఎఫ్‌బీఓ రాములు, సిబ్బంది ఇబ్రహీం, కళ్యాణ్ తదితరులు ఉన్నారు.



ట్రయల్ రన్‌లో భాగంగా పుట్టిలో పర్యటిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

క్లుప్తంగా

జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): అన్నపురెడ్డిపల్లి గురుకుల కళాశాలలో ఈ నెల 18 నుంచి నిర్వహించనున్న జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అధికారులకు సూచించారు. కళాశాల ప్రాంగణంలో శనివారం ఆయన అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని, ఇల్లెందు, పాల్వంచ, భద్రాచలం, అశ్వారావుపేట, కొత్తగూడెం నుంచి ప్రత్యేకంగా బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. నిర్వహణ కమిటీలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం ప్రదర్శన గదులు, భోజన స్టాళ్లను ఎమ్మెల్యే పరిశీలించారు. డీఈఓ వెంకటేశ్వరాచారి, డీఎస్ఓ చలపతిరాజు, తహసీల్దార్ జగదీశ్వర్‌ప్రసాద్, ఎంపీడీఓ మహాలక్ష్మి, ఎంఈఓ ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

దేశి శిక్షణ నూతన బ్యాచ్ ప్రారంభం

చుంచుపల్లి: దేశి శిక్షణ కొత్త బ్యాచ్‌ను జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాబూరావు శనివారం చుంచుపల్లి రైతువేదికలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని సకాలంలో అందించి పంటల ఉత్పాదకతతో పాటు రైతుల ఆర్థిక పరిస్థితిని పెంపొందించటమే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణమ్మ మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో వ్యవసాయ సమాచారం సమస్త ఇన్‌పుట్ డీలర్ల వద్ద రైతులకు లభించేలా చేయడం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారావు, శిక్షణా ఫెసిలిటేటర్ జి.డేవిడ్ జయపాల్‌రావు, జిల్లా ఇన్‌పుట్ డీలర్ల అధ్యక్షులు సోమసుందరం, కోశాధికారి జి.నాగేశ్వరరావు, జి.కింజిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై సస్పెన్షన్ వేటు

కొత్తగూడెంఅర్బన్: విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన హెచ్‌ఎంపై సస్పెన్షన్ వేటు పడింది. డీఈఓ కథనం మేరకు.. కొత్తగూడెం పట్టణ పరిధి మేదరబస్తీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఫలిభాస్కర్ విధుల విషయంలో తీవ్ర నిర్లక్ష్యం, రిపోర్టుల సమర్పణలో అలసత్వం, ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేశాడు. సర్వే విధులకు సైతం గైర్హాజరు కావడం, అధికారులకు సమాచారం ఇవ్వకపోవడం తదితర కారణాలతో సస్పెండ్ చేశామని డీఈఓ వెంకటేశ్వరాచారి తెలిపారు.

గుడిసెలు తొలగించిన అటవీ అధికారులు

ఇరువర్గాల మధ్య వాగ్వాదం

అశ్వారావుపేటరూరల్: రిజర్వ్ ఫారెస్టు భూమిలో నిరుపేద గిరిజనులు ఏర్పాటు చేసుకున్న గుడిసెలను శనివారం అటవీ శాఖ అధికారులు తొలగించారు. దీంతో గిరిజనులు, అటవీ అధికారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా, రహదారిపై ధర్నా చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తిరుమలకుంట ఫారెస్టు సెక్షన్ మామిళ్లవారిగూడెం బీట్ పరిధిలోని వినాయకపురం సమీపంలోగల ఎర్రగుంటపల్లి వద్ద రెండు రోజుల కిందట స్థానిక సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో నాలుగు ఎకరాల విస్తీర్ణంలోని రిజర్వ్ ఫారెస్టు భూమిలో సుమారు వందమంది గిరిజన కుటుంబాలు గుడిసెలు ఏర్పాటు చేశాయి. కాగా, రెండేళ్లుగా ఈ స్థలం విషయంలో స్థానిక గిరిజనులు, అటవీ అధికారులకు మధ్య వివాదం నెలకొంది. ఈ క్రమంలోనే వారంతా తాజాగా గుడిసెలు, డేరాలను ఏర్పాటు చేసుకున్నారు. సమాచారం తెలుసుకున్న అశ్వారావుపేట, దమ్మపేట ఫారెస్టు రేంజర్లు కరుణాకర్‌చారి, మురళితోపాటు మరో 80 మంది అటవీ సిబ్బంది గిరిజనులు ఆక్రమించిన ప్రాంతానికి చేరుకొని గుడిసెలను పూర్తిగా తొలగించారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసు కోగా, అధికారులను అడ్డుకున్న గిరిజనుల్లో ఐదుగురిని అదుపులోకి తీసుకొని దమ్మపేట ఫారెస్టు రేంజ్ కార్యాలయానికి తరలించారు. దాంతో ఆగ్రహించిన గిరిజనులు మామిళ్లవారిగూడెం – వినాయకపురం ప్రధాన రహదారిపై దాదాపు గంట పాటు ధర్నా చేపట్టారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ యయాతి రాజు ఘటనా స్థలానికి చేరుకొని ధర్నా చేస్తున్న గిరిజనులతో మాట్లాడి, ధర్నాను విరమింపజేశారు. అనంతరం గిరిజనులంతా గుడిసెలు ఏర్పాటు చేసుకున్న భూమిలో నే బైఠాయించగా.. ఫారెస్టు రేంజర్లు గిరిజనులతో మాట్లాడారు. రిజర్వ్ ఫారెస్టులో అక్రమంగా గుడిసెలు ఏర్పాటు చేస్తే తొలగిస్తామని, ఇళ్ల స్థలాల సమస్యను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. దీంతో గిరిజనులంతా అక్కడి నుంచి వెళ్లిపోయారు.



రహదారిపై ధర్నా చేస్తున్న గిరిజనులు

ఆలయ నిర్వహణలో రెండువర్గాలు



ఆందోళన చేస్తున్న కమిటీ బాధ్యులు

పాల్వంచ: పాల్వంచలోని అయ్యప్ప స్వామి ఆలయ పాలకవర్గంలో రెండు గ్రూపులు ఏర్పడటం భక్తులను ఆందోళనకు గురిచేస్తోంది. ఆలయాన్ని ఒకరు ట్రస్ట్‌గా, మరొకరు నూతన కమిటీగా రిజిస్ట్రేషన్ చేయించారు. ఇదిలా ఉండగా ఆలయ ఆవరణలో శుక్రవారం నూతన కమిటీ ఏర్పాటు చేసినట్లు ఫ్లెక్సీలను తొలగించారని ఎదుటి వర్గం శనివారం ఆందోళనకు దిగడం గమనార్హం. అయ్యప్పస్వామి ఆలయానికి పదేళ్లుగా నూతన కమిటీని నియమించకపోవడంతో భక్తుల నుంచి డిమాండ్ వస్తోంది. ఈ నేపథ్యాన ముగ్గురికి బాధ్యతలు అప్పగించగా వారు కాలయాపన చేయడమేకాక ట్రస్ట్‌గా రెండు నెలల కిందట రిజిస్ట్రేషన్ చేశారు. ఇందులో కొత్వాల శ్రీనివాసరావు, సంతోష్ గౌడ్, కాల్వ భాస్కర్, కనగాల రాంబాబు, వేమారెడ్డి, బందెల శ్రీను, మిరియాల కమలాకర్ ఉన్నారు. ఈ విషయం తెలియడంతో మరో వర్గం వారు కొత్త కమిటీని రిజిస్ట్రేషన్ చేయించారు. ఇందులో అజ్మీర రామదాసు, కొత్తచెరువు హర్షవర్ధన్, ముగిది శ్రీనివాస్‌రావు, మారుతి నాగేశ్వరరావు, జుజ్జూరి ప్రభాకరాచారి, రచ్చ పురుషోత్తం, పైడి నాయుడు సహా 40 మంది సభ్యులు ఉన్నారు. ఈ మేరకు కొత్త కమిటీ ఆధ్వర్యాన ఆలయంలో శుక్రవారం ఫ్లెక్సీ ఏర్పాటు చేయగా, శనివారం ఉదయం కల్లా చించేసి ఉంది. దీంతో వారు బీసీఎం రహదారిపై ధర్నాకు దిగగా పోలీసులు సర్దిచెప్పడంతో ఆలయం ముందు ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పదేళ్లుగా కమిటీ వేయకపోగా, గుట్టుచప్పుడు కాకుండా ట్రస్ట్‌గా మార్చారని ఆరోపించారు. భక్తులు సమర్పించే నిధుల ఆదాయ, వ్యయాలు కూడా చెప్పడం లేదని, నాలుగు కుంటల భూమిని విక్రయించారని తెలిపారు. కార్యక్రమంలో హర్షవర్ధన్, వెంకటేశ్వర్లు, శ్రీను తదితరులు ఉన్నారు.

డీసీహెచ్‌ఎస్‌పై విచారణ



అధికారులతో మాట్లాడుతున్న ఎర్రా కామేశ్

కొత్తగూడెంరూరల్: డీసీహెచ్‌ఎస్‌గా పనిచేస్తున్న డాక్టర్ రవిబాబునాయక్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలపై కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం విచారణ జరిగింది. డీసీహెచ్‌ఎస్ అవినీతికి పాల్పడ్డారని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రా కామేశ్ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్‌కు ఆగస్టు 5న ఫిర్యాదు చేయగా ఆయన ఆదేశాలకు మేరకు ఖమ్మం మెడికల్ సూపరింటెండెంట్ రాజశేఖర్‌గౌడ్, ఎం.సత్యనారాయణ, ఎల్.సునీల్‌కుమార్, సీహెచ్ రత్నాకర్‌రావు కలెక్టర్ కార్యాలయంలో శనివారం విచారణ చేపట్టారు. ఫిర్యాదు దారులను పిలిచి, ఏం జరిగిందో అడిగి తెలుసుకున్నారు. నోటిఫికేషన్ లేకుండా అక్రమ నియామకాలు చేపట్టారని, వాటిలో రూల్స్ ఆఫ్ రోస్టర్ విధానం పాటించలేదని, బదిలీలు, డిప్యూటేషన్లు, అక్రమ పద్ధతిలో టెండర్ లేకుండా పనులు నిర్వహించారని కామేశ్ వివరించారు.

పదివేల ఎకరాల్లో మునగ సాగు లక్ష్యం

అశ్వారావుపేటరూరల్: జిల్లావ్యాప్తంగా పదివేల ఎకరాల్లో మునగ పంట సాగు లక్ష్యంగా జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ప్రణాళికలు సిద్ధం చేశారని, దీంట్లో భాగంగా ఇప్పటికే రెండు వేల ఎకరాల్లో పంట సాగును మొదలు పెట్టినట్లు డీఆర్‌డీఏ ఏపీడీ నల్లబోతుల రవి తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం నిధులు నిరుపయోగం కావొద్దన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లు లేని గృహాలను గుర్తించి, జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మునగ సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని, సాగు చేసేందుకు ముందుకు వచ్చే రైతులకు అన్ని విధాలుగా సహకారం అందించాలని సూచించారు. మునగతోపాటు వెదురు సాగుపై కుడా దృష్టి పెట్టాలని చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎంపీఓ సోయం ప్రసాద్, ఈజీఎస్ ఏపీఓ రామచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పూజల పేరిట రూ.55 లక్షలు టోకరా

- భద్రాద్రి జిల్లాకు చెందిన ట్రాన్స్‌జెండర్‌తో పాటు నలుగురి అరెస్ట్
- రూ.34 లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ, పక్కన ఏసీపీ, సీఐ, వెనుక నిందితులు

జనగామ : మాయలు చేస్తాం.. మంత్రాలు చేస్తాం.. దోషాలను నివారిస్తామంటూ మాయమాటలతో బురిడీ కొట్టిస్తూ అమాయకులను మోసగించి రూ.లక్షల్లో దండుకున్న ముఠాను జనగామ పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈమేరకు జనగామ పోలీస్‌స్టేషన్‌లో శనివారం డీసీపీ రాజమహేంద్రనాయక్ వివరాలు వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం సత్యనారాయణపురం గ్రామానికి చెందిన ట్రాన్స్‌జెండర్ భట్టు నాగదేవికి మూడేళ్ల క్రితం జనగామ బాణాపురానికి చెందిన కారు డ్రైవర్ పాముకుంట్ల సందీప్ పరిచయమయ్యాడు. 2023 అక్టోబర్ 10న ఇద్దరు వివాహం చేసుకున్నారు. నాగదేవి భిక్షాటన ద్వారా వచ్చే డబ్బు కుటుంబ పోషణకు సరిపోకపోవడంతో తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా జనగామకు చెందిన సిరివెన్నెల, ఆమె తమ్ముడు నిఖిల్ వద్దకు 2024 అక్టోబర్ 1వ తేదీన నాగదేవి, సందీప్ వెళ్లారు. అక్కాతమ్ముడికి మాయ మాటలు చెప్పి వారి ఇంట్లో ఉన్న దోషాలను తొలగించేందుకు పూజలు చేస్తామంటూ నమ్మబలికి సిరివెన్నెల, ఆమె తమ్ముడి నుంచి దఫాలుగా రూ.55లక్షల నగదు, ప్లాట్ డాక్యుమెంట్లు తీసుకున్నారు. ఈ విషయమై బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమాన ఏసీపీ పార్థసారధి, సీఐ దామోదర్‌రెడ్డి నెహ్రూ పార్క్ వద్ద శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా నాగదేవి, సందీప్, వారికి సహకరించిన మెతుకు గణేశ్, గుగులోత్ నవీన్, భూక్యా గణేశ్ పట్టుబడ్డారు. వీరిలో అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకోగా 30 తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.10 లక్షల విలువైన భూమి రిజిస్ట్రేషన్ పత్రాలు, కారుతో పాటు ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టిన 4.6 గ్రాముల బంగారం రశీదులను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ రాజమహేంద్రనాయక్ తెలిపారు. కాగా, 24 గంటల్లోనే కేసును ఛేదించిన ఏసీపీ, సీఐలను సీపీ అభినందించారని డీసీపీ వెల్లడించారు.

దైవదర్శనానికి వెళ్తొస్తూ అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో తండ్రీకుమారుడు మృతి
- ఇదే ఘటనలో తీవ్రంగా గాయపడిన భార్య

చంద్రుగొండ/ఎర్రుపాలెం: కుటుంబ పెద్ద అయ్యప్ప మాల ధరించాడు.. భార్య, కుమారుడితో కలిసి భద్రాచలంలో శ్రీసీతారామచంద్ర స్వామి దర్శనానికి ద్విచక్రవాహనంపై వెళ్లాడు.. స్వామిని దర్శించుకుని తిరిగి వస్తుండగా ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ప్రమాదవశాత్తు ఢీకొట్టడంతో తండ్రీకుమారుడు మృతి చెందగా ఆయన భార్యకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనలో తండ్రి, సోదరుడు మృతి చెంది, తల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా వారి కుమార్తె ఒంటరిగా మిగిలిపోయింది. చంద్రుగొండ మండలం తిప్పనపల్లి వద్ద శనివారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి.

కొత్తపాలెం టు భద్రాచలం

ఎర్రుపాలెం మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన చిలుమూరు సతీష్‌కుమార్‌శర్మ(43) అయ్యప్ప మాల ధరించాడు. అశ్వాపురంలోని సాయిబాబా ఆలయంలో రెండేళ్లు, లక్ష్మీపురంలోని సాయిబాబా ఆలయంలో ఏడాది పాటు పూజారిగా పనిచేసిన ఆయన ప్రస్తుతం ఎర్రుపాలెం మండలం కొత్తపాలెంలోని ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకత్వం చేస్తున్నాడు. ఆయనకు భార్య లక్ష్మీహిమబిందు, కుమారుడు హనీశ్వర్(9)తో పాటు కుమార్తె నిత్యలక్ష్మి ఉన్నారు. ఇందులో కుమార్తె ఎర్రుపాలెం కేజీబీవీలో ఆరో తరగతి, కుమారుడు స్థానిక ఎస్వీ అకాడమీ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. కాగా, శనివారం ఉదయం భార్య, కుమారుడితో కలిసి సతీష్‌కుమార్ భద్రాచలంలో శ్రీసీతారాముల దర్శనానికి బైక్‌పై వెళ్లాడు. అక్కడ స్వామిని దర్శించుకున్నాక తిరిగి వస్తుండగా చంద్రుగొండ మండలం తిప్పనపల్లి వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. బైక్ అదుపు తప్పడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తుండగా సతీష్‌కుమార్, ఆయన కొడుకు హనీశ్వర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సతీష్ భార్య లక్ష్మీహిమబిందుకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై చంద్రుగొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ప్రమాదంలో తండ్రి, సోదరుడు మృతి చెందగా.. తల్లి తీవ్రగాయాల పాలై ఆస్పత్రిలో ఉండడంతో వారి కుమార్తె నిత్యలక్ష్మిని బంధువులు హాస్టల్ నుంచి తీసుకురాగా కన్నీరుమున్నీరుగా విలపిస్తుండడం అందరినీ కంటతడి పెట్టించింది.



సతీశ్‌కుమార్ శర్మ (ఫైల్)



హనీశ్వర్ (ఫైల్)

ఎక్వేరియంతోనే ప్రమాదమా?

బైక్‌పై ముందు సతీష్‌కుమార్‌శర్మ కుమారుడు హనీశ్వర్, వెనుకాల భార్య లక్ష్మీహిమబిందు కూర్చున్నారు. అయితే, కుమారుడి చేతిలో ఎక్వేరియం ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షుల ద్వారా తెలిసింది. పెట్రోల్ ట్యాంక్‌పై ఎక్వేరియం పెట్టుకుని కూర్చోగా బైక్ హ్యాండిల్ తిప్పలేకపోయి ఉంటాడని సమాచారం. ఈ కారణంగానే రహదారిపై ఎడమవైపు వెళ్తున్న బైక్ కుడివైపు ఓ రైతు ఇంటి ముందు ఆగి ఉన్న ట్రాక్టర్ ట్రక్కును బలంగా ఢీకొట్టినట్లు తెలుస్తోంది. కాగా, ఘటనలో తండ్రీకుమారుడి తలలు ఛిద్రమై మృతి చెందగా, తండ్రిని హత్తుకున్నట్లు పడి ఉన్న కుమారుడి మృతదేహాన్ని చూసి స్థానికులు కన్నీరుమున్నీరయ్యారు.

తడికలపూడిలో చోరీ

టేకులపల్లి: తాళం వేసి ఉన్న ఇంట్లో బంగారం, నగదు చోరీ అయిన ఘటనలో టేకులపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ పి.సురేశ్ కథనం ప్రకారం.. మండలంలోని తడికలపూడి గ్రామానికి చెందిన నారపోగు రామయ్య శుక్రవారం ఇంటికి తాళం వేసి కొత్తగూడెంలో ఉంటున్న కూతురు వద్దకు వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేరని గమనించిన గుర్తుతెలియని దుండగుడు తాళం పగులకొట్టి బీరువాలో ఉన్న సుమారు 18 గ్రాముల బంగారం, రూ.40 వేల నగదు చోరీ చేశాడు. శనివారం నారపోగు రామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

ఇల్లెందు: పట్టణంలోని కొత్త బస్టాండ్ సెంటర్‌లో ఓ కిరాణా దుకాణంలో రూ.30 వేల విలువ గల గుట్కాప్యాకెట్లను పోలీసులు పట్టుకున్నారు. శనివారం సీఐ సత్యనారాయణ వివరాలు వెల్లడించారు. కొత్త బస్టాండ్ సెంటర్‌కు చెందిన శ్రీలక్ష్మీగణపతి కిరాణా దుకాణంలో పోలీసులు తనిఖీ చేయగా పలు రకాల గుట్కాప్యాకెట్లు, అంబర్ ప్యాకెట్లు లభించగా స్వాధీనం చేసుకున్నారు. వ్యాపారి శంకర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ వివరించారు. తనిఖీల్లో ఎస్‌ఐ సందీప్, సిబ్బంది ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



రాజేంద్రప్రసాద్ (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: ఉరి వేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. నారంవారిగూడేనికి చెందిన పాకనాటి రాజేంద్రప్రసాద్(36) మద్యానికి బానిస కాగా.. భార్య శ్రీలత గొడవపడుతోంది. శుక్రవారం కూడా అతిగా మద్యం సేవించి వచ్చిన భర్తను మందలించి పిల్లలను తీసుకొని దగ్గర్లోనే ఉన్న అత్త, మామ ఇంటికి వెళ్లింది. రాజేంద్రప్రసాద్ మద్యం మత్తులో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న ఎస్సై యయాతి రాజు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి తండ్రి పుల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



గురుప్రసాద్ (ఫైల్)

ఇల్లెందురూరల్: సెంట్రింగ్ పనిచేస్తూ కిందపడి తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని సంజయ్‌నగర్‌కు చెందిన గురుప్రసాద్ (57) పట్టణంలోని ఓ ఇంట్లో వారం కిందట సెంట్రింగ్ పనిచేస్తూ కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి.. అక్కడి నుంచి ఖమ్మం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురుప్రసాద్ శనివారం మృతి చెందాడు. మృతుడికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పురుగులమందు తాగిన వ్యక్తి...

భద్రాచలంఅర్బన్: పురుగులమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం మృతిచెందాడు. పట్టణంలోని కుర్రాజులగుట్టకు చెందిన పునుగుపాటి రాము మద్యం మత్తులో శుక్రవారం పురుగులమందు సేవించాడు. అతడిని కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎప్పుడూ మద్యం సేవించి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించేవాడని మృతుడి భార్య రమణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ విజయలక్ష్మి కేసు నమోదు చేశారు.

గంజాయి పట్టివేత

దుమ్ముగూడెం: గంజాయి తరలిస్తూ ఇద్దరు వ్యక్తులు పట్టుబడిన ఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. సీఐ అశోక్ కథనం మేరకు.. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లికి చెందిన యనమలగండ్ల సాంబయ్య, కోడి రాంబాబు ట్రాలీ ఆటోలో 26.810 కేజీల గంజాయి తరలిస్తూ వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డారు. వారు ఆంధ్ర ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి గంజాయి కొనుగోలు చేసి తెలంగాణలో విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని, వారి వద్ద నుంచి రూ.6100 నగదు, రెండు సెల్‌ఫోన్లు, ట్రాలీ ఆటో స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని సీఐ వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్రగాయాలు

టేకులపల్లి: వేగంగా వచ్చిన కారు సింగరేణి ఎక్స్‌ప్లోసివ్స్ వాహనాన్ని ఢీకొట్టడంతో ఐదుగురికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన రోహిత్ (డ్రైవర్), కిరణ్, కీర్తి, ప్రవళిక, దీప్తి శనివారం టీఎస్09ఈ 6890 నంబర్ గల కారులో భద్రాచలం బయలుదేరారు. ఇల్లెందు మీదుగా వస్తున్న క్రమంలో మండలంలోని బేతంపూడి స్టేజీ మూలమలుపు వద్దకు రాగానే అదుపుతప్పి ఎదురుగా వస్తున్న సింగరేణి ఎక్స్‌ప్లోసివ్ వాహనాన్ని ఢీకొట్టింది. రెండు వాహనాలు దెబ్బతినగా.. కారులో ఉన్న ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ రోహిత్, కిరణ్ ఇరుక్కుపోవడంతో ఎస్‌ఐ సురేశ్ ఆధ్వర్యంలో పోలీసులు, స్థానికులు బయటకు తీశారు. వారందరినీ కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. మిగిలిన నలుగురికి కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



నుజ్జునుజ్జయిన కారు.. దెబ్బతిన్న సింగరేణి వాహనం

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

భద్రాచలం వాసికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న త్రివేణి (మధ్యలో)

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణానికి చెందిన త్రివేణి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం షహరాన్‌పూర్‌లోని గ్లోకల్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకుంది. ప్రొఫెసర్ క్రిషన్ పాల్ ఆధ్వర్యాన పప్పు ధాన్యాల పంటల సాగుపై సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి గాను ఆమెకు డాక్టరేట్ ప్రకటించారు. కాగా, త్రివేణి ప్రస్తుతం మహబూబ్‌నగర్‌లోని మహిళా డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా విధులు నిర్వర్తిస్తుండగా పలువురు ఆమెను అభినందించారు.

పాల్వంచ వాసి రాంకుమార్‌కు...



రాంకుమార్‌వర్మ

పాల్వంచ: పాల్వంచలోని సీతారాంపట్నంకు చెందిన దమ్మాలపాటి రాంకుమార్ వర్మకు నోయిడా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ లభించింది. గతంలో ఆయన అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసారు. ప్రస్తుతం ఖమ్మంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల్లో ఇంగ్లిష్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న ఆయనకు డాక్టరేట్ రావడంపై పలువురు అభినందించారు.

ఉద్యోగులంతా విధులకు హాజరయ్యేలా చూడాలి



అధికారులతో సమీక్షలో పాల్గొన్న జీఎంలు

సింగరేణి(కొత్తగూడెం): సంస్థ వ్యాప్తంగా ఉద్యోగులందరూ విధులకు హాజరయ్యే విధంగా పర్యవేక్షించాల ని సింగరేణి జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం) కవితానాయుడు, జీఎం (సివిల్) సూర్యనారాయణ సూచించారు. విధులకు గైర్హాజరవుతున్న ఉద్యోగులకు కుటుంబాలతో కలిపి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న నేపథ్యాన కొత్తగూడెం నుంచి శనివారం వారు ఏరియాల వారీగా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జీఎంలు మాట్లాడు తూ.. విధులకు హాజరుకాని ఉద్యోగులకు కుటుంబ సభ్యులతో కలిపి కౌన్సెలింగ్ ద్వారా సమస్యలు తెలుసుకోవాలన్నారు. అందులో వాస్తవాలు ఉంటే ఆస్పత్రులకు రిఫర్ చేయాలని సూచించారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 75కంటే తక్కువ మస్ట ర్లు ఉన్న 771మంది ఉద్యోగులకు కౌన్సెలింగ్ త్వరగా పూర్తిచేయాలని, ఆ తర్వాత క్రమశిక్షణ చర్యలు ఉంటాయనే విషయమై అవగాహన కల్పించాలని తెలిపా రు. ఈ వీసీలో వివిధ విభాగాల అధికారులు బొజ్జ రవి, సీహెచ్.వెంకయ్య, కె.అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం టు అమరావతి!



ఎర్రుపాలెం రైల్వేస్టేషన్

రైల్వేలైన్ నిర్మాణానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్

- లైన్ ఏర్పాటైతే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి
- మరోపక్క జమలాపురంలో పర్యాటక అభివృద్ధిపై దృష్టి
- రేమిడిచర్లలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు అడుగులు

ఎర్రుపాలెం: ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండల కేంద్రం నుండి ఏపీ రాజధాని అమరావతి వరకు లైన్ లైన్ నిర్మాణానికి కేంద్రప్రభుత్వం ఇటీవలే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నూతన లైన్ ఏర్పాటైతే తెలంగాణ - ఏపీ రాష్ట్రాల సరిహద్దుగా ఉన్న ఎర్రుపాలెం రైల్వేస్టేషన్ జంక్షన్‌గా మారే అవకాశముంది. అమరావతి రైల్వే లైన్‌తో పలు గ్రామాలు అనుసంధానం కానుండడం.. ఏపీ నుంచి మండలంలోని జమలాపురంలో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి ఇప్పటికే వస్తున్న భక్తులు, పర్యాటకుల సంఖ్య మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. అంతేకాక రైల్వే లైన్‌కు తోడు నాగపూర్ - అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే సైతం ఎర్రుపాలెం మండలం మీదుగా వెళ్తోంది. ఇప్పటికే పనులు కూడా మొదలయ్యాయి. తద్వారా ఈ ప్రాంతం అభివృద్ధికి అడుగులు పడతాయని స్థానికులు చెబుతున్నారు.

రైల్వేలైన్ ఏర్పాటుకు కసరత్తు

ఎర్రుపాలెం నుంచి ఏపీ రాజధాని అమరావతికి వరకు నూతన రైల్వేలైన్ నిర్మాణం కోసం కేంద్రం పచ్చజెండా ఊపింది. దీంతో ఇటు తెలంగాణ, అటు ఏపీలో అవసరమైన భూసేకరణకు వేగంగా కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే ఏపీ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా, గుంటూరు, పల్నాడు జిల్లాలో 450 హెక్టార్ల మేర భూసేకరణ చివరి దశకు చేరింది. ఎర్రుపాలెం మండల పరిధిలోని 27 ఎకరాల భూసేకరణకు ఇక్కడి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ రైల్వే లైన్ ఎర్రుపాలెం, పెద్దాపురం, చెన్నారావుపాలెం, గొట్టిముక్కల, పరిటాల, కొత్తపేట, వడ్లమాను, అమవరాతి, తాటికొండ, కొప్పురావూరు నూతన స్టేషన్ల మీదుగా 57 కి.మీ. మేర ఎర్రుపాలెం - అమరావతి - నంబూరు వరకు నిర్మిస్తారు.

వ్యవసాయ భూముల ధరలకు రెక్కలు

ఏపీకి సరిహద్దు మండలంగా ఎర్రుపాలెం ఉండడంతో వ్యవసాయ భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఇక్కడ రోడ్డు వెంట ఎకరా పొలం ధర రూ.30లక్షలు మొదలు రూ.కోటి వరకు పలుకుతోంది. సామాన్యులు కొనుగోలు చేయలేని స్థితిలో ధరలు పెరిగాయి. ఖాళీ స్థలాలు రేట్లు కూడా గణనీయంగా పెరుగుతున్నాయి. ఫలితంగా రియల్ ఎస్టేట్ వెంచర్లు వెలుస్తున్నాయి. వెంచర్లలో గజం స్థలం ధర రూ.5వేల నుండి 15వేలకు పైగా పలుకుతోందని చెబుతున్నారు. ఏదిఏమైనా రైల్వేలైన్ నిర్మాణం, ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు తోడు జమలాపురంలోపర్యాటక అభివృద్ధిపై దృష్టి సారించడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే ఇండస్ట్రియల్ పార్క్

మధిర నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు డిప్యూటీ సీఎంగా ఉండడంతో నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే ఎర్రుపాలెం మండలం రేమిడిచర్ల గ్రామంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు భూమి కేటాయించగా, డ్రోన్ టెస్టింగ్ తయారీ కంపెనీ ప్రతినిధులు ఇటీవల పరిశీలించారు. అలాగే, జమలాపురం పుణ్యక్షేత్రంలో అటవీ అధికారులు పార్క్ ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టారు. ఎర్రుపాలెం నుంచి అమరావతి వరకు రైల్వే లైన్, నాగపూర్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం.. ఈ మండలంలో నే తెలంగాణ తిరుపతిగా పేరున్న వేంకటేశ్వర స్వామి ఆలయం ఉండడంతో మండలానికి మహర్దశ పడుతుందని ప్రజలు ఆశిస్తున్నారు.

అబివృద్ధిపై నమ్మకం ఏర్పడింది..



డిప్యూటీ సీఎం భట్టి చొరవతో అభివృద్ధిపై నమ్మకం ఏర్పడింది. రేమిడిచర్లలో ఇండస్ట్రియల్ పార్కు, జమలాపురంలో పర్యాటక అభివృద్ధి, అటవీ పార్కు ఏర్పాటు, అన్ని గ్రామాలకు అనుసంధానంగా బీటీ రోడ్ల నిర్మాణం జరుగుతుండడం ఆనందంగా ఉంది. – శీలం ప్రతాపరెడ్డి, తక్కెళ్లపాడు

ఎర్రుపాలెంను జంక్షన్‌గా మార్చాలి..



తెలంగాణ-ఏపీ సరిహద్దుగా ఎర్రుపాలెం నుంచి ఏపీ రాజ, దాని అమరావతికి రైల్వేలైన్ నిర్మిస్తున్నందున జంక్షన్‌గా మార్చాలి. తద్వారా ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుంది. అలాగే, శాతవాహన, మచిలీపట్నం, పద్మావతి రైళ్లకు హాల్టింగ్ కల్పించాలి. –శేగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, భీమవరం

మెరుగుపడనున్న రవాణా సౌకర్యం



నూతన రైల్వేలైన్ నిర్మాణంతో రవాణా సౌకర్యం మెరుగవుతుంది. ప్రస్తుతం అమరావతికి వెళ్లాలంటే ఇబ్బందులు ఉన్నాయి. రైల్వే లైన్ నిర్మిస్తే ఆ సమస్యత తీరడమే కాక డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చొరవతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుంది. – మల్లెల లక్ష్మణరావు, ఎర్రుపాలెం

యోగా ఇన్‌స్ట్రక్టర్ల నియామకం

వైరారూరల్: వైరా మండలం గొల్లపూడిలోని ప్రభుత్వ ఆయుర్వేదిక్ డిస్పెన్సరీ విభాగానికి ప్రభుత్వం ఇద్దరు యోగా ఇన్‌స్ట్రక్టర్లను కేటాయించిందని ఆయుర్వేదిక్ వైద్యుడు జె.రాజేష్ తెలిపారు. వైరా మండలం బ్రాహ్మణపల్లికి చెందిన పైల్లా పద్మావతి, మధిర మండలానికి చెందిన ఎం.కృష్ణను ఇన్‌స్ట్రక్టర్లుగా నియమించగా వారు శనివారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ మానసిక, శారీరక రుగ్మతల నుంచి ఉపశమనంతో పాటు భవిష్యత్‌లో అనారోగ్యం దరి చేరకుండా యోగా సాధన ఉపయోగపడుతుందని తెలిపారు.



విధుల్లో చేరుతున్న యోగా ఇన్‌స్ట్రక్టర్లు

గుండాల బిడ్డకు పతకాల పంట!

- కరాటేలో దూసుకెళ్తున్న చందన
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న ఇంటర్ విద్యార్థిని



సాధించిన పతకాలు, తల్లిదండ్రులతో చందన



కరాటే పోటీలో సహచర విజేతలతో.. (ఫైల్)

గుండాల: లక్ష్యాన్ని చేరాలనే పట్టుదల.. అందుకు తగినట్లుగా శ్రమిస్తే ఏ ప్రాంతం నుంచి వచ్చిన వారైనా విజయాలు సొంతం చేసుకుంటారు. ఇందుకు ఉదాహరణగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండల కేంద్రానికి చెందిన కొండపల్లి జంపన్న – శారదల కుమార్తె చందన నిలుస్తోంది. చిన్న వయస్సు నుంచే కరాటేపై ఆసక్తితో శిక్షణ పొందిన ఆమె జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సొంతం చేసుకుంది.

8వ తరగతి నుంచి పోటీలకు..

గుండాలకు చెందిన కొండపల్లి జంపన్న – శారద కుమార్తె చందన హన్మకొండ ఏఎస్‌పీఆర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. ప్రాథమిక విద్య జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం, 7 నుంచి 10వ తరగతి వరకు మహబూబాబాద్ జిల్లా పాఖాల కొత్తగూడెం మండలం గాంధీనగర్ గిరిజన గురుకులంలో చదివింది. అక్కడ కరాటే మాస్టర్ సుధ ద్వారా 7వ తరగతి నుంచే శిక్షణ తీసుకుంది. ఆ తర్వాత 8వ తరగతి నుంచే వివిధ ప్రాంతాల్లో జరిగే కరాటే పోటీలకు హాజరవుతూ వరుస విజయాలు సాధిస్తోంది.

వరుసగా బంగారు పతకాలు

తొలిసారి 2021లో వరంగల్‌లో జరిగిన జిల్లాస్థాయి కరాటే పోటీల్లో పాల్గొన్న చందన బంగారు పతకం గెలుచుకుంది. ఆ తర్వాత విశాఖపట్నంలో జరిగిన పోటీల్లో మరో బంగారు పతకంతో పాటు వైట్ బెల్ట్ స్వీకరించింది. 2022లో ఖమ్మంలో జరిగిన ఏషియన్ ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్ షిప్ అండర్–15 విభాగంలో పోటీ పడి బంగారు పతకం సాధించింది. అదే ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన నేషనల్ ఎఫ్ఎస్‌కేపే కరాటే చాంపియన్ షిప్ అండర్–15 విభాగంలోనూ బంగారు పతకం గెలుచుకుంది. ముంబైలో 2022లో జరిగిన పునాకోషి షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన పోటీలు, ఢిల్లీ, గోవాలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లోనూ బంగారు పతకాలు స్వీకరించింది. ఇటీవల గోవాలో జరిగిన వరల్డ్ కప్ కరాటే చాంపియన్ షిప్ అండర్–18 విభాగంలో పాల్గొనగా ఎనిమిదో పతకం సొంతమైంది. అంతేకాక త్వరలోనే అంతర్జాతీయ స్థాయిలో ఎంపికై మలేషియాలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు చందన అర్హత సాధించింది. కాగా, వరుస బంగారు పతకాలతో కరాటేలో సత్తా చాటుతున్న ఆమెకు మెరుగైన శిక్షణ ఇప్పించేలా అధికారులు సహకరిస్తే దేశానికి పేరు తీసుకొస్తుందని పలువురు కోరుతున్నారు. గుండాల ప్రాంతం నుంచి కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్ క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటిన క్రీడాకారులు ఉండగా, కరాటేలో మాత్రం మొదటి క్రీడాకారిణి చందనే కావడంతో పలువురు అభినందిస్తున్నారు.

సగం రోడ్డు మేర ధాన్యమే..

ఇల్లెందురూరల్: వానాకాలంలో సాగుచేసిన వరి, మొక్కజొన్న కోతలు జోరుగా సాగుతున్నాయి. కోతలు పూర్తిచేసిన రైతులు పంట క్షేత్రాలను యాసంగి సాగుకు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యాన చేలలో ఖాళీ లేకపోవడంతో మొక్కజొన్న, వరి ధాన్యాన్ని రహదారులపై ఆరబోస్తున్నారు. ఇల్లెందు మండలంలోని కొమ్ముగూడెం నుంచి మస్సివాగు వరకు ఎటు చూసినా రోడ్డుకు సగం మేర వడ్లు, మొక్కజొన్న గింజలే కనిపిస్తున్నాయి. వాహన చోదకులు ఏ మాత్రం అజాగ్రత్తగా వెళ్లినా ప్రమాదం జరిగే అవకాశముంది. గతంలో పలుమార్లు రహదారులపై ప్రమాదాలు జరిగాయి. ఈ నేపథ్యాన వాహనదారుల క్షేమం దృష్ట్యా అన్నదాతలు పంట ఉత్పత్తులను ఆరబోసేందుకు చేన్లలోనే కల్లాలు సిద్ధం చేసుకుంటే మంచిదని పలువురు కోరుతున్నారు.



కొమ్ముగూడెం-మస్సివాగు రహదారిపై ఆరబోసిన మొక్కజొన్న